

# కెలంకరించిన కథ

గొల్లపూడి మారుతీరావు

అమ్మ పోయాక విశాఖపట్నం వెళ్లే అవసరంకాని, ఉత్సాహంకాని తగిపోయింది. ఏదో సభో, సమావేశమో ఉన్నప్పుడు వెళ్లడం, పని కాగానే తిరుగుముఖం పట్టడం. అక్కడ నాకో ఇల్లు. మా అమ్మ నాకో కథ చెప్పేది. ఒకాయన తమలపాకుల వ్యాపారం చేసేవాడట. లేత, కవటాకులు తుని నుంచి తెప్పించేవాడు. ఒకటి రెండు రోజులు అమ్మగా మిగతావి వాడి, కుళ్లు చూపేవి. రోజూ ఈ కుళ్లు ఆకులు – కుళ్లు పట్టిన మేరకి కత్తిరించి తను వాడుకునే వాడు. అమ్మకం లేత తమలపాకులు. తను తినేవి కుళ్ళు ఆకులు. నేను లేనప్పుడు – లేని కారణాన ఇల్లు పాడయేది. ఇక్కడ వర్షం నీరు నిలిచి, అక్కడ కిటికీ ఊచలు తుప్పుపట్టి, మరో చోట గోడ సున్నం రాలిపోయి – ఇలాగ. నాపని వచ్చినప్పుడల్లా – ఇలా పాడయిన యింట్లో ఉండడం, మరమ్మత్తులు చేయించడం – తీరా చూడ ముచ్చటగా, నివాసయోగ్యంగా ఉన్నదనిపించగానే తాళం వేసి ఊరెళ్లడం. నాది కుళ్లు తమలపాకులవాడి కథ.

ఈసారి వర్షాలకు ఇల్లు బాగా పాడయిపోయిందని చాలా వారాలు ఉండే ఆలోచనతో, మా ఆవిడని తీసుకుని దిగాను. ఊరు బాగా మారింది. విశాఖపట్నంలో ఒకప్పటి ప్రశాంతత తగ్గింది. రద్దీ పెరిగింది. ఏనాడూ ఎరగనంతగా ఎక్కడచూసినా ట్రాఫిక్ నిలిచిపోతోంది. నా చిన్నతనం నాటి విశాఖపట్నం – వొళ్లు చేసిన పసిబిడ్డ. అంతటా తెలిసిన ముఖాలూ, చిరునవ్వుల పలకరింతలూ. ఇప్పుడు వొళ్లు విరుచుకున్న ప్రౌఢలాగ వుంది. ఎవరికీ ఎవరితోనూ పొంతన లేదు. ఎవరి మానాన వాళ్లు పరుగులు తీస్తున్నారు. నేను సినీనటుడిని కావడం వల్ల అతికించుకున్న చిరునవ్వులు మెరిసి మాయమవుతున్నాయి. నగరంలో 'హృదయం' లోపించింది.

మా ఇంటి దగ్గరే రైతుబజారు. కాని బజారు బయట – నేను డాబామీద నిలబడితే పలికేలాగ – ఎదురింటి మొగిలో ఒకావిడ కూరలు రోడ్డు పక్క పరిచి అమ్ముతోంది. విశాఖపట్నం వంకాయలకీ, దొండకాయలకీ పెట్టిందిపేరు. నా బలహీనత 'నోరు'. కారు దిగి ఆ దుకాణం ముందు నిలబడ్డాను. కూరలమ్మే మనిషి నన్ను చూసి ఒక్క క్షణం తెల్లబోయింది. అంతలో ముఖమంతా నవ్వుచేసుకుంది. ''నువ్వా బాబూ! సినీమాల్లో బాగా

సేత్తావు. సూపరూ!'' అంది. పలకరింత నాకు కొత్త కాదుకాని ఆ నవ్వులో నిండుతనం, నిజాయితీ కొట్ట వచ్చినట్టు కనిపించింది. శరీరం కల్తీ లేని నల్లటి నలుపు. నవ్వితే పళ్లన్నీ కనిపించి ముఖం వెలిగిపో యింది. ఎర్రటి బొట్టు, వంగపండు రంగు చీరె, మెడలో పూసల గొలుసు, చేతికి బాబా ఉంగరం.

''నీ పేరు?''

''అమ్మాజీ''

నాలుగయిదేళ్ల కిందట అమ్మాజీ అందగత్తె అయివుండాలి. నల్లటి టస్కనీ పాలరాయిలాగ వొళ్లు మెరుస్తోంది. మొన్నమొన్నటిదాకా పొగాకు వేసేదనుకుంటాను. దురలవాటు ఛాయలు తెలు స్తున్నాయి. శరీరం సోకగా, శాల్తీ అందంగా వుంది. ఇప్పుడిప్పుడే మాసిపోతున్న అందం.

అడిగిందే తడవుగా, ఉదారంగా కూరలు ఇచ్చింది. ధరలు సరసంగా వున్నాయి. రోజూ సాయంకాలం మేడమీదకి వచ్చి మిగిలిపోయిన కూరల్లో ఒకటి రెండయినా – వద్దంటున్నా ఇంటి ముందు గుమ్మరించిపోయేది.

''నువ్వు సూపరుబాబూ!'' అన్నది అమ్మాజీ నన్ను చూసినప్పుడల్లా అనే ఊతపదం.

ఓసారి అడిగాను – 'ఏ వూరు?'

'పెద గంట్యాడ'

'నీ పొలాల్లో పంటలా? మారు వ్యాపారమా?'

వెంటనే సమాధానం చెప్పలేదు. ఆ ప్రశ్నకి వెదుక్కోవలసిన అవసరం ఏముంది? సొంత పొలంలో పంటయితే సాయంకాలమో, పొద్దుటో కోసి గంపల కెత్తుతారు. మారు వ్యాపారమయితే – ఉదయమే రోడ్డు మొగిలో పెట్టుకునే గంపల్ని టోకుగా బేరం చేసి బస్సెక్కుతారు – నగరంలో అమ్ముకోడానికి.

కూరలు పరిచిన పక్క ఇంట్లో పంజాబీ కుటుంబం అద్దెకుంది. గోడమీద గుబురుగా ఎరుపు బోగన్ విలియా ముసురుకుని ఉంది. రాగానే – ఆ చెట్టునుంచి ఓ కాగితం పూలగుత్తి కొప్పులో తురుముకొనేది. ఎవరూ బోగన్ విలియా పువ్వులు తురుముకోగా చూడలేదు. కాని అమ్మాజీ కోసమే ఆ పువ్వులు ఎదురుచూస్తున్నట్టు – నల్లటి శాల్తీకి ఎర్రటి అంచుగీసినట్టు పువ్వులు అమిరేవి. ఆమె కొప్పులో కొలువుదీరడానికి ఆత్రం పడుతు న్నట్టు కనిపించేవి.

మా ఇంటికి మూడో వీధిలో చిన్నపిల్లల హాస్టలు ఉండేది. ఓసారి మసక వెలుగులో ఇంటికి వస్తూంటే చీకట్లో కలిసిపోయిన అమ్మాజీ రోడ్డు పక్క నడుస్తూ కనిపించింది. కారాపి పలకరిం చాను. నన్ను చూడగానే ముఖంలో నవ్వు పూసింది. 'నువ్వా సూపరుబాబూ!' అంది.

'మిగిలిపోయిన కూరలు – ఇదిగో ఈ పిల్లల సత్రానికిస్తా బాబూ' అంది.

'మిగిలిపోయినవీ, పుచ్చులూ, ముదుర్లూ ఇవ్వడం అన్యాయం'

భోగిపళ్లు పోసినట్టు గలగలమని నవ్వింది. 'అయి నాకవసరం లేదు. ఆళ్లకి గతిలేదు. డబ్బు అడగను బాబూ' అంది. మంచి ఆలోచనే. అనివా ర్యమైన పరిస్థితులలో గడుసయిన దాతృత్వం.

రోజూ కారులో అమ్మాజీ దుకాణం ముందు నుంచే వెళ్లాలి. ఓ రోజు నా కారు కోసం ఎదురు చూస్తూ నిలబడింది. కనిపించగానే కారుకి అడ్డుప డింది. వెంటనే కొంగుముడి విప్పింది. అందులో ముడతలు పడిన ఆటో గ్రాఫ్ పుస్తకం కనిపించింది. ఆశ్చర్యపోయాను.

''బాబూ, ఈ పుస్తకం మీద నిశానీ సెయ్యాల'

'ఎక్కడిదీ పుస్తకం?'

సిగ్గుపడుతూ చెప్పింది. 'నాది కాదు బాబూ. మా వూరి బొట్టిడు. పైస్కూల్లో సదువు తున్నాడు. సురేకారం లాటోడు. సూపరుబాబు కనిపిత్తాడ్రా అని సెప్పాను. ఈ పుస్తకమిచ్చాడు''వాడి పేరు?'' సిన తిరపతి'

నవ్వొచ్చింది. 'తిరుపతిలో చిన్నా పెద్దా ఉన్నాయా?'

'ఆడు అందర్లోకీ బుడ్డోడు బాబూ – మా వూరి పైడితల్లి కొడుకు. ఆడి పెద్ద పెళ్లానికి ముగ్గురు




సంతానం. పెద దాయి సిన్నకొడుకు – సిన తిర పతి

'పెద్ద పెళ్లాం అంటున్నావు. పిల్లల తండ్రికి మరో పెళ్లాం కావలసి వచ్చిందా?' సంతకం చేస్తూ అన్నాను.

భళ్లున సమాధానం వచ్చింది. 'ఆడికి కాదు బాబూ – ఆ దాయికే మొగుడు కావల్సి వచ్చాడు' ఒక్క క్షణం తెల్లబోయాను. కోరి పెళ్లి చేసుకున్న ఆ రెండో పెళ్లాన్ని చూడాలనిపించింది.

ఏమైనా అమ్మాజీ నాకో ఎనిగ్మా. మాటల్లో అతి సునిశితమైన లాజిక్ కనిపిస్తుంది. మంచి వ్యాపారి లక్షణాలవి. మరి ఈ ఔదార్యం ఎక్కడినుండి వచ్చింది? అమ్మాజీలో ఆమెది కానిదేదో ఉంది. ఏమిటది? ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు.

ఓసారి అనకాపల్లిలో ఉన్న మా తమ్ముడి ఇంటికెళ్లాను. నేను లోపల టీవీ చూస్తున్నాను. మా తమ్ముడు బయట కూరలు బేరం చేస్తున్నాడు.

'కాయ నాణెం చూడకండి బాబూ. పెదగంట్యాడ దొండలు. నోట్లో వేస్తే కరిగిపోతాయి' అంటున్నాడు కూరల మనిషి. పెద గంట్యాడ పేరు వినగానే తుళ్లి పడ్డాను. నేను వీధిలోకి వచ్చేసరికే కూరల కావిడి భుజానికెత్తుకున్నాడు. 'నీకు అమ్మాజీ తెలుసా?' అన్నాను.తేలుమీద కాలేసినట్టు తుళ్లిపడ్డాడు. అంతలో అతని ఆసక్తి సన్నగిల్లిపోయింది. 'అది తమకెలా తెలుసు బాబూ – పీనాసి లంజె' అంటూ కదిలిపోయాడు.

నేను నిర్ఘాంతపోయాను. ఉచితంగా నా గడపలో పోసే కూరలు, ఉదారంగా బేరాన్ని తెగ్గొట్టే ధోరణి, రోజూ పిల్లల హాస్టల్‌కి మిగులు కూరలు చేరవేయడం – అమ్మాజీ పీనాసి అంటాడేమిటి! అతని గొంతులో విసుగు, కోపం, ఉదాసీనత – వీటిలో లోపం లేదు. మరి? అమ్మాజీ మంచితనంలో ఏదైనా లోపం ఉందా?

వెంటనే చెన్నై వచ్చేశాను. మరి ఆరేడు నెలల దాకా విశాఖపట్నం వెళ్లే అగత్యం రాలేదు. ఒకసారి ఏదో రెండు రోజుల సభలకి బరంపురం వెళ్తూ విశాఖలో ఆగాను. ఆ రెండు రోజులూ ఇంటి దగ్గర ఏదో లోపం కనిపించింది. రెండో రోజు గుర్తుపట్టాను. అమ్మాజీ కూరల దుకాణం లేదు.

కావాలనే పనిగట్టుకుని ఉదయం కూరల కావిళ్లు దిగే చోటుకి వెళ్లాను. రోజూ పిఠాపురం కాలనీ దగ్గర వందల అరటిపళ్ల గెలలు దిగుతాయి. పరదేశిపాలె, పెరుగు వలస, కొమ్మాది, రేగి – ఇలా వూళ్ల నుంచి దిగిన గంపల టోకు వ్యాపారం ఇక్కడ సాగుతుంది. చిల్లర గంపలు తెలతెలవారుతూండగా బయలుదేరుతాయి.

'పెద గంట్యాడ నుంచి వచ్చిన వాళ్లెవరయినా ఉన్నారా?' అని అడిగాను.

ఓ ముసిలి ముఖం కళ్లు విప్పి తలెత్తింది. 'అమ్మాజీ నీకు తెలుసా?' అడిగాను. కూరలు కొంటాననుకుంది కాబోలు. తీరా ఓ పేరు – అదిన్నీ అమ్మాజీ వూసెత్తేసరికి నిస్పృహతో తలదించుకుంది. ఎందుకా నిస్పృహ? అమ్మాజీ గురించి మాట్లాడడం ఇష్టం లేదు. 'దాని నోట్లో నోరెట్టి బతకనేం బాబూ. మా వూళ్లో బగమంతుడు నోరుసేసుకు బతకమని దాన్ని పుట్టించాడు' వెంటనే ఆగి బస్సులో గంపతో ఎక్కేసింది పూర్ణా మార్కెట్టుకి.

ఆశ్చర్యపోయాను. అమ్మాజీ గురించి నాకు ఏర్పడిన అభిప్రాయాన్ని ఏకగ్రీవంగా చెడగొట్టిన రెండో వ్యక్తి ఈ ముసల్ది. ఎక్కడ వుంది లోపం? వుంటే ఏమిటది? ఇంతకీ అమ్మాజీ ఎక్కడ? 48 గంటల తర్వాత – సభ ముగిసి చెన్నై వెళ్లిపోయాను. దూరప్రయాణంలో బస్సు ఆగినప్పుడు ఎదురుగా విరగబూసిన గన్నేరు చెట్టు కనిపిస్తుంది. ఒక్కక్షణం 'అహా!' అనిపిస్తుంది. ప్రయాణం సాగిపోతుంది, జ్ఞాపకం మరుగున పడిపోతుంది. నిజానికి ఆ అనుభూతికి 'జ్ఞాపకం' స్థాయిని ఇవ్వదు మనస్సు. ఎందుకని? ఆ అనుభూతి మారిపోయే కాలగమనంలో జారిపోయే సాదాసీదా అనుభూతి కనుక. ప్రత్యేకంగా జ్ఞాపకం వుంచుకోవలసిన వ్యక్తి కాదు అమ్మాజీ. అవసరమూ లేదు.

విచిత్రంగా – ఆ తర్వాత విశాఖ హడావుడిగా ఒకటి రెండుసార్లు వచ్చినా ఆమె ఆలోచన రాలేదు. అక్కడ ఇప్పుడు కూరల దుకాణం లేదు. న్యాయంగా ఇది కథ కాదు – దీనికి కాళ్లూ చేతులే కాని గుండెకాయ లేదు కనుక. ఇది కథకి పనికి వచ్చే సరుకు కాదు. కొన్ని పాత్రలు ఆలోచనలలో మెరిసి మాయమయిపోతూంటాయి. నన్ను చిరునవ్వుతో పలకరించిన – కూరలమ్మే మనిషి చిరునవ్వుకి ప్రత్యేకస్థానం లేదు.

కాని దాదాపు అయిదారేళ్ల తర్వాత ఈ కథకి గుండెకాయ దొరికింది. ఎలాగంటే – బాల చెరువు దగ్గర ఏవో స్థలాలున్నాయని, ఇప్పుడు పనికి రాకపోయినా పెట్టుబడిగా ముందు ముందు డబ్బు చేసిపెడతాయని మా మిత్రుడు శర్మ నన్ను ఫోన్‌లో ఊరిస్తూ వచ్చాడు. ఓసారి నేను రాజమండ్రి వస్తున్నానని తెలుసుకుని – కారులో వచ్చి నన్ను విశాఖపట్నంలో విమానం ఎక్కించే పూచి మీద బాలచెరువు తీసుకొచ్చాడు.

చుట్టుపక్కల స్థలాల గురించి చెప్తూ చుట్టుపక్కల పల్లెలు ఎలా వొళ్లు విరుచుకుని విజృంభిస్తున్నాయో వివరిస్తున్నాడు శర్మ. నాలుగైదు పల్లెల పేర్లలో ఒక్క పేరు విని తుళ్లిపడ్డాను – పెద గంట్యాడ.

'ఎక్కడ ఆ వూరు?' అన్నాను.

దూరంగా కనిపించే తాటితోపు చూపించాడు. అటు కారుతిప్పమన్నాను.

'కాని – అక్కడ – మంచి స్థలాలేవీ --'

'పద' అని రెట్టించాను.

ఊరు చిన్నది. పెంకుటిళ్లు విరివిగా పుంజుకుంటున్నాయి. పల్లెలు – పాంటు తొడుక్కున్న గ్రామీణ యువతుల్లాగ సిమ్మెంటు కట్టడాలతో, టీవీ ఏంటినాలతో, సినీమా పోస్టర్లతో – వికారంగా తయార



## చేసిన పొరపాటు దిద్దుకోలేనిది...

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుంది చార్మి విషయం. నిన్న మొన్నటి దాకా ఎక్స్‌పోజింగ్‌ను నమ్ముకొని కోలీవుడ్, టాలీవుడ్‌లలో సెక్సీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న చార్మి ఇప్పుడు తెగ బాధపడిపోతోందట! "మొదట్లో అందరూ నన్ను సెక్సీ హీరోయిన్ అంటే నా అందానికి వారు ఇస్తున్న కితాబు అని మురిసిపోయాను. ఇప్పుడు అదే నా పాలిట శాపంగా పరిణమించింది. చాలా చిన్న వయస్సులోనే ఫీల్డులోకి రావడంతో ఎవరు ఏం చెప్పినా నమ్మేశాను. ఏం చెయ్యమన్నా చేశాను. అందుకే నాకు సెక్సీ హీరోయిన్‌గా పేరు వచ్చింది. ఇప్పుడు బుద్ధి వచ్చింది. అలాంటి పొరపాట్లు చేయను. ఇక ముందు స్కిన్ షోకి, సెక్సప్పీల్‌కి దూరంగా ఉంటాను. అటువంటి పాత్రలు వస్తే వాటిని వదులుకుంటాను కానీ, డబ్బు కోసం వాటిని చేయను" అంటూ తెగేసి చెబుతోంది. లేటుగా అయినా లేటెస్ట్ నిర్ణయం తీసుకుందని పలువురు చార్మిని అభినందిస్తున్నారు.

వుతున్నాయి.

దారిలో కనిపించిన ఒకతడిని ఆపి: 'ఇక్కడ – అమ్మాజీ – ఇల్లెక్కడ?' అనడిగాను. అమ్మాజీ ఝాన్సీ లక్ష్మీభాయో, మదర్ థెరిస్సానో కాదు – అందరూ పేరు చెప్పగానే గుర్తుపట్టడానికి. కాని అది పల్లె. ఒక్కసారి గాలివేస్తే వూరంతా కదులుతుంది. ఆగి 'అమ్మాజీ మీకు తెలుసాబాబూ?' అన్నాడు సాదరంగా. అమ్మయ్య. మొదటిసారి – మొదటి వ్యక్తి – అమ్మాజీ పేరు చెప్పగానే ఈసడించుకోలేదు. ఆ ప్రశ్నలోనే తనకి తెలుసన్న నిజం తెలుస్తోంది.

'ఆ కట్టమైసమ్మ గుడి దాటాక మొదటి ఇల్లు బాబూ. దేవుడిని టోకరా కొట్టి పేణాలు తెచ్చుకుంది. చచ్చి బతికింది' అంటూ వెళ్లిపోయాడు. మళ్లీ కథకి చిన్న ప్రాణం వస్తోంది.

కూరలమ్మకునే మనిషి ఇల్లు ఎలావుంటుంది? చిన్న పాక, ఓ పాడి గేదె, కోళ్ల బుట్టలు, సిలవరి బొచ్చెలు. కాని అమ్మాజీ ఇల్లు అలా లేదు. చక్కని పెంకుటిల్లు. లోపల మండువా లోగిలి తెలుస్తోంది. మరి విశాఖపట్నంలో రోడ్డుపక్క కూరల వ్యాపారానికి అర్థమేమిటి? గుమ్మంలో అడుగుపెట్టగానే చిన్న మంచం మీద కూర్చున్న అమ్మాజీని గుర్తుపట్టాను. మూర్తిని చూసి కాదు. టస్కనీ నల్లరాయి రంగుని చూసి. కాని ఇప్పుడి రంగు కాస్త సడలింది. శరీరం బడలింది. చిక్కి, బక్కచిక్కి మంచం మీద ఉంచిన నల్లశానం రాయిలాగ వుంది. అదే వంగ పువ్వు రంగు చీరె. ఆ రంగు అమ్మాజీకి ఇష్టమేమో. మెడ చుట్టూ కొంగు తిప్పుకుంది. వొదులుగా నన్ను పోల్చుకోడానికి పెద్ద శ్రమపడలేదు. 'సూపరు బాబూ!' అని కేకవేస్తుందనుకున్నాను. కాని శబ్దం రాలేదు. కళ్ల వెంట నీళ్లొచ్చాయి. ఇదేమిటి? అమ్మాజీకి కంటతడిపెట్టుకోవడం తెలుసా? మెల్లగా దుఃఖాన్ని చిరునవ్వుగా తర్జుమా చేసింది. కాని ఆ నవ్వులో ముందటి మెరుపు లేదు.

వెనకనుంచి ఓ గొంతు మాట్లాడింది. 'చచ్చి బతికింది బాబూ. వద్దన్నా లేచినప్పట్నుంచీ నిద్దరోయేదాకా పొగాకు నమిలేది. నాలుగేళ్ల కింద చచ్చిపోయేదే. కాన్సరన్నారు. కాని బొంబాయి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాను. దేవుడికి చెప్పుకొనొచ్చింది. 'పేణానికి భయం లేదన్నారు' – ఈ కథంతా చెప్పిన మనిషి – చెప్తూనే మంచం మీద కూర్చుని అమ్మాజీని పొదివి పట్టుకున్నాడు.


'నా పేరు పైడితల్లి బాబూ' అన్నాడు. పెద గంట్యాడలో కలుసుకోకపోతే పైడితల్లి చిన్న రాజకీయ నాయకుడిలాగ అనిపించేవాడు. తెల్లగా బొద్దుగా ఉన్నాడు. బట్టతల. తెల్లటి ఖద్దరు లాల్చీ. పంచె. అమ్మాజీ పట్ల ప్రేమ, ఆప్యాయతా ఆమెని పెనవేసుకున్న అతని చేతుల్లో, కళ్లల్లో తెలుస్తోంది.

'కేన్సరని తెలిశాక అమ్మాజీ నన్ను పెళ్లి చేసుకుంది బాబూ. నాకు దూరపు చుట్టం. చేసుకోకపోయినా సాకుతానన్నాను. ఒప్పుకోలేదు. నన్ను చేసుకుని నా పిల్లల్నే సాకింది. ఇద్దరికీ పెళ్లిళ్ళు చేసింది. నేను ఒక ఎకరం రైతుని. దానిది పదకొండెకరాల మాగాణీ, రెండెకరాల కొబ్బరితోట. ఈ రోగం రాక ముందు ఇది రాక్షసి బాబూ' అన్నాడు మరింత హత్తుకుంటూ.

ఇంతసేపూ మాట్లాడదేం? అదే అడిగాను. అమ్మాజీ మెడమీద కొంగుని తొలగించాడు పైడితల్లి. మెడకి చిన్న రంధ్రం. 'మాట పోయింది బాబూ. పేణం మిగిలింది.'

కూర్చోమని సంజ్ఞ చేసింది అమ్మాజీ. కాని ఇక అక్కడ ఉండడానికి మనస్కరించలేదు. నాతో పైడితల్లి కారుదాకా వచ్చాడు. 'మీరు బాగా ఏక్టు చేస్తారు బాబూ' అన్నాడు నా భుజం మీద చెయ్యేసి. అది చొరవా? అభిమానమా? నాకు నచ్చలేదు. ఇంకా నాకర్థం కాని విషయమొకటుంది. 'ఇంత ఆస్తి పెట్టుకుని విశాఖపట్నంలో కూరలెందుకమ్ముకుంది?'

నవ్వాడు పైడితల్లి 'ఊరంతా దాన్ని తిట్టేవాళ్లే బాబూ. దానికొచ్చిన కష్టానికి జాలిపడిన వాళ్లు లేరు. ఎక్కడికో పారిపోవాలి. కూరలమ్మకం దానికి ఓ సాకు, నేనూ చెప్పిచూశాను. కాని వినిపించుకోలేదు. రోజూ విశాఖపట్నం వెళ్లొచ్చేది. కేన్సరొచ్చాక రెండెకరాలు మైసమ్మ గుడికి రాసిచ్చింది. మా ఇంటి పక్కన చిన్న బడి పెట్టించింది''ఇప్పుడూ నలుగురూ అమ్మాజీని తిట్టుకుంటారా?'నవ్వాడు.




'చావు దాన్ని భయపెట్టింది బాబూ. బతకడం ఆళ్లని జాలిపడేట్టు చేసింది. ఇప్పుడేం తగాదాలు లేవు. అమ్మాజీ కొమ్ములిరిగిన గంగిగోవు. చావు దాన్ని ఉతికి ఆరేసింది' అన్నాడు.

నాకా మాట బాగా నచ్చింది. చావు కొందరిని ఉతికి ఆరేస్తుంది. ఎటువంటి మురికినయినా వదిలించి శుభ్రం చేస్తుంది. డబ్బున్న 'పీనాసి లంజ' జీవితం ముగింపుకు రాబోతోందన్న సత్యం తెలియగానే అలవాటు లేని కొత్త ధోరణిని అలంకరించుకుంది. కొందరిని మృత్యువు జీవితం మీద తిరగబడేటట్టు చేస్తుంది. కొందర్ని లొంగదీస్తుంది. కొందరిని వేదాంతంలో పడేస్తుంది. అమ్మాజీ ఔదార్యం, మంచితనం 'రుచి' మరిగింది. తనని ఈసడించుకునే పాత ప్రపంచం నుంచి ఆ కాసిని రోజులూ పారిపోవాలనుకుంది. అదే విశాఖపట్నంలో కూరల వ్యాపారం. చచ్చిపోవడానికి సిద్ధమవుతున్న అమ్మాజీలో ఔదార్యం ఆమె జీవితమంతా పాటించిన సుగుణం కాదు. అందుకే కొత్తగా, అతికినట్టు కనిపించింది. రైతు బజారులో వ్యాపారానికి లైసెన్సు కావాలి. అమ్మాజీ వ్యాపారం సాకు. అందుకే పంజాబీ ఇంటి పొరుగున అంగడి. ఆఖరి రోజుల్లో కోరి ఒకరిని మనువాడింది. తను కనని ముగ్గురు పిల్లలకి తల్లి అయింది. అది జీవితంలో తాను ఇక నిర్వహించలేని పాత్ర. హడావుడిగా సంపాదించుకున్న అర్హత.

కాని జీవితంలో మరో విచిత్రమైన మలుపు కలిసివచ్చింది. చావకుండా బతికింది. అప్పుడేమయింది? అంతకుముందే అలవాటయిన మంచితనం మిగిలిపోయింది. మంచితనం కూడా ఒక్క జబ్బే. పట్టుకుంటే, రుచిమరిగితే వదలదు. గుడి, బడీ అందుకు నిదర్శనాలు.

ఎవరో వెనుకనుంచి గావుకేక పెట్టి నన్ను పిలుస్తున్నారు. కారాపమన్నాను. ఒక మోటారు సైకిలు నా కారుకి అడ్డంగా ఆగింది. అతి మోడరన్‌గా ఉన్న ఓ కుర్రాడు కారు దగ్గరికి వచ్చాడు – 'నేను మీ ఫాన్‌ని సార్!' అన్నాడు. విసుగేసింది. అది చెప్పడానికా కారాపింది?

'నా పేరు చిన తిరుపతిసార్! మా మమ్మీ మీకిది ఇవ్వమంది' అని జేబులోంచి ఓ పాత కాలపు గొలుసు వాచీని తీశాడు. వెండి గొలుసు చివర వేలాడుతున్న పాతకాలపు వాచీ. జర్మన్ వాచీ. ఎప్పుడో ఆగిపోయింది. బహుశా అమ్మాజీ తండ్రిదయి ఉండవచ్చు. నేను బయటికి రాగానే హడావుడిగా వెదికి తీసి ఉండవచ్చు. ఈ వాచీ వినియోగం కాదు. ఒక అభిజ్ఞ. జ్ఞాపకం. మృత్యువు ఉతికి ఆరేసిన ఒక జీవితకాలపు మాలిన్యంనుంచి బయటపడిన ఓ వ్యక్తి 'మంచితనం' అనే వ్యసనానికి గుర్తు.

ఈ ప్రయాణంలో పెట్టుబడికి విలువైన ఆస్తి దొరకలేదుకాని, అంతకన్న విలువైన వాస్తవాన్ని జేబులో ఉంచుకుని కారెక్కాను.

★

రచయిత సెల్ : 98410 30170